


ఫలం.. పోషకాలు పుష్కలం

రంజాన్ మాసంలో పండ్లకు భలే గిరాకీ ఉంది. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు పండ్లనే ఇష్ట పడుతారు. వీటిలో పోషకాలు అధికంగా ఉండడమే ఇందుకు కారణం. 10లో▸




ముస్తాబైన రామాలయాలు

శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0 /22.0

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉంటుంది. గాలిలో తేమ స్వల్పంగా పెరుగుతుంది.



కూలి పెరిగింది



- ఉపాధి కూలీలకు కూలి రూ.15 పెంపు
- ఏప్రిల్ 1నుంచి అమలు చేస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో 3.3 లక్షల మందికి లబ్ధి
- అమలుకు నోచుకోని వేసవి భత్యం

జిల్లాలో పథకం వివరాలు

జాబ్‌కార్డుల సంఖ్య	1.71 లక్షలు
మొత్తం కూలీలు	3.3 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.27 లక్షలు
పనులకు వెళ్లే కూలీలు	2.27 లక్షలు
వెచ్చించిన నిధులు	రూ.13,713.48 లక్షలు
ఇచ్చిన వేతనాలు	రూ.8,634.87 లక్షలు
మెటీరియల్ ఖర్చు	రూ.5,078.61 లక్షలు

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం



ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలకు వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన వేతనానికి సంబంధించిన ఉత్తర్వులు అందగానే అమలు చేస్తాం. జాబ్‌కార్డులు కలిగిన కూలీలు వేసవికాలంలో పనులు సద్వినియోగం చేసుకోవాలి.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

నిర్మల్‌చైన్‌గేట్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం పెరగనుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉత్తర్వులు అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఒక్కో కూలీకి రూ.257 చెల్లిస్తుండగా.. ఇక నుంచి రూ.272 అందనుంది. ఈ నిర్ణయంతో జిల్లాలో 3.3 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది.

కేంద్రం పర్యవేక్షణలో..

ఉపాధిహామీ పథకం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా అధీనంలోకి తీసుకున్న కేంద్రం పనిదినాల లక్ష్యాల కేటాయింపులను కూడా పర్యవేక్షిస్తోంది. కూలీల సంఖ్య ఆధారంగా గ్రామం, బ్లాక్ (మండలం), జిల్లాకు పనిదినాల లక్ష్యాలను నిర్దేశిస్తోంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే పనిదినాల లక్ష్యాన్ని కొంతమేర పెంచుతూ జిల్లాలకు ప్రత్యేక లక్ష్యాలు ఇచ్చేది. కానీ.. కొత్త సాఫ్ట్‌వేర్ రావడంతో కేంద్రం సూచనలే అమలవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయాన ఉపాధిహామీ పనులు వినియోగించుకునే కూలీల సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంది. ఈ ఏడాది ఉపాధి పనులను జిల్లాలో 3.3 లక్షల మంది వినియోగించుకున్నారు.

వేసవిభత్యం ఊసేది?

వేసవి దృష్ట్యా గతంలో ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కూలీలకు 20శాతం అదనపు భత్యం ఇచ్చేది. కానీ.. ఈ వేసవిలో అదనపు భత్యం ఊసేలేకుండా పోయింది. దీంతో కూలీల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ఉపాధి పని దినాలు పెంచేందుకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు అదనపు భత్యాన్ని అందజేసేది. దీంతో పని చేసిన కూలీలకు ఆ రోజు పొందే కూలిలో ఫిబ్రవరి నెలలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శా తం అదనపు భత్యం చెల్లించేవారు. కానీ.. ఉపాధిహామీ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గతంలో వినియోగించిన సాఫ్ట్‌వేర్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎస్‌ఐసీ) సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టింది. దీంతో ప్రస్తుత ఏడాది నుంచి ఉపాధి చెల్లింపులు నేరుగా కేంద్ర ప్రభుత్వం ఎస్‌ఎస్‌ఐసీ ఆధ్వర్యంలోకి వెళ్లడంతో అందులో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకునే వీలు లేకుండా పోయింది. ఎండల తీవ్రత, వసతుల లేమి కారణంగా పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రాములోరి పెళ్లికి రారండోయ్..



ముస్తాబైన జిల్లాకేంద్రంలోని బాగులవాడ రామాలయం

- నేడు ఊరూరా సీతారాముల కల్యాణం
- వేదికలుగా మారిన రామాలయాలు
- సందడిగా కనిపిస్తున్న వీధులు
- నిర్మల్, భైంసాల్లో శోభాయాత్రలు
- బందోబస్తుకు సిద్ధమైన పోలీసులు



జిల్లాకేంద్రంలోని బ్రహ్మపురి రాంమందిర్‌లో తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

నిర్మల్: 'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..' అంటూ రాములోరి పెళ్లి చూసేందుకు జిల్లా సిద్ధమైంది. ఊరూరా గల రామాలయాలే పెళ్లి వేదికలు కానుండగా వీధులన్నీ ఏర్పాట్లతో సందడిగా మారాయి. ఊరంతా వీక్షించేందుకు వాడంతా పందిళ్లు వేస్తున్నారు. ఇప్పటికే కొత్తరంగులద్దుకుని, విద్యుల్లతలతో రామాలయాలు కాంతులీనుతున్నాయి. ఊరి ప్రజలే పెళ్లిపెద్దలు కాగా సీతమ్మను రామయ్య మనువాడనున్నాడు. కనుల పండువగా సాగే కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులంతా సిద్ధమయ్యారు. శ్రీరామనవమి పర్వదినాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకునేందుకు సకల ఏర్పాట్లు చేశారు. పర్వదినాన్ని పురస్కరించుకుని పలు హిందూ సంస్థల ఆధ్వర్యంలో నిర్మల్, భైంసాల్లో రామనవమి శోభాయాత్ర నిర్వహించనున్నారు.

సందడిగా వీధులు..

రాముడుండని ఇల్లు లేదు, రామాలయం లేని ఊరు లేదు అన్నట్లుగా.. చిన్నదో పెద్దదో దాదాపు ప్రతీ మండలంలో పేరున్న రామాలయాలున్నాయి. శ్రీరామనవమి పర్వదినాన వేకువజాము నుంచే భక్తుల దర్శనాలు కొనసాగుతాయి. ఆలయాల్లో సీతారాముల దర్శనం చేసుకోవడంతోపాటు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కొనసాగే ఉత్సవమూర్తులతో సాగే కల్యాణోత్సవాన్ని వీక్షిస్తారు. రాములోరి పెళ్లి విందునూ భక్తులకు అందించేందుకు ఆలయకమిటీలు అన్నదాన ఏర్పాట్లు పూర్తిచేశాయి. రామనవమి ఏర్పాట్లతో ఆయా ఆలయాల వీధులన్నీ సందడిగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

శోభాయాత్రలు..

శ్రీరామనవమిని పురస్కరించుకుని పలు హిందూ సంస్థలు గత కొన్నేళ్లుగా శోభాయాత్రలు నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా నిర్మల్, భైంసా పట్టణాల్లో గురువారం ఈ యాత్రలు చేపట్టనున్నారు. ఇప్పటికే భైంసా, తానూరులో చేపట్టే యాత్రలకు హైకోర్టు అనుమతిచ్చింది. జిల్లాకేంద్రంలో దేవరకోట లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం నుంచి భారీ రాముడి విగ్రహంతో పలు వీధుల గుండా శోభాయాత్ర సాగనుంది. ఉదయం 10గంటల నుంచే ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథిగా ఎంపీ సోయం బాపూరావు, ముఖ్య వక్తగా రాజులదేవి దిగంబర్ హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం కొనసాగుతుండడం, గతంలో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు అలర్ట్‌గా ఉన్నారు. ఇప్పటికే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని, రెచ్చగొట్టేలా మాట్లాడొద్దని సీరియస్‌గా హెచ్చరించారు. ప్రశాంతంగా పండుగలు జరుపుకొనేలా ప్రజలు సహకరించాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కోరారు.

తరతరాలుగా వేడుకలు

జిల్లాలోని పలు రామాలయాల్లో తరతరాలుగా రామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని బ్రహ్మపురి రాంమందిర్‌లో గత కొన్ని దశాబ్దాలుగా సీతారాముల కల్యాణోత్సవాన్ని చేపడుతున్నారు. అలాగే స్థానిక బాగులవాడ రామాలయానికి భారీసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. శాంతినగర్ రామాలయంలోనూ కనులపండువగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తుంటారు. జిల్లాకేంద్రంలోని ఆలయాలతోపాటు భైంసా మండలం కామోల్, లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి, కడెం సీతారామచంద్రస్వామి, నర్సాపూర్(టీ) మండలకేంద్రంతో పాటు మండలంలోని రాంపూర్, ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్‌తో పాటు మండలంలో మస్కాపూర్‌లోగల రామాలయాలు జిల్లాలో ప్రధానాలయాలుగా పేరొందాయి.

న్యూస్‌రీల్

మంత్రి సత్యవతి రాథోడ్‌కు కలెక్టర్ స్వాగతం



మంత్రికి మొక్క ఇస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను బుధవారం నిర్మల్ ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నిర్మల్ మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న సందర్భంగా నిర్మల్ ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో ఆమె ఆగి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంత్రిని కలిసి పూలమొక్క అందజేశారు.

కంటివెలుగు శిబిరం పరిశీలన



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడ 40 వార్డులో కంటివెలుగు శిబిరాన్ని బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి సందర్శించారు. రోజుకు 100 మందికి పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కౌన్సిలర్ తన వార్డు సమస్యలు వివరించగా పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇచ్చారు. లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి, గంద్రత్ రమణ, ప్రవీణ్‌రెడ్డి, గంద్రత్ రమేశ్, డీఎస్ రాజేశ్వర్, శంకర్ పోశెట్టి, బద్రి రాజేశ్వర్, కాలనీవాసులు పాల్గొన్నారు.


పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



శోభాయాత్ర స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే శ్రీ రామనవమి శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీరామనవమి, రంజాన్ పండుగలను ఇరువర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు, వివిధ పోస్టులను నమ్మి ఆవేశాలకు లోనుకాకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. శోభాయాత్ర మార్గంలో గుంతలు పూడ్చి వేయించి రహదారిపై ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ మల్లేశ్ తదితరులున్నారు.

4న అంబేద్కర్ జీవితచరిత్రపై నృత్యరూపకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసాటౌన్: అంబేద్కర్ జీవితచరిత్రను నృత్యరూపకంగా ప్రదర్శించనున్నట్లు భైంసా దళిత, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక ఏరియాస్పత్రి వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట పోస్టర్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 4న సాయంత్రం 7గంటలకు భైంసాలోని పార్డి(బీ) బైపాస్ రోడ్‌లో సంఘం శరణం గచ్ఛామి పేరిట నృత్యరూపకం ఉంటుందని పేర్కొన్నారు. సామాజిక సంఘాలు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, ఇతరులు హాజరై తిలకించాలని కోరారు. నాయకులు ప్రసంజిత్ ఆగ్రే, భీంరావు డొంగ్రే, గిరిధర్ జంగ్మే, గౌతం పింగ్లే తదితరులున్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, డీఈవో

నిర్మల్ రూరల్: ఏప్రిల్ 3నుంచి 13వరకు పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి సూచించారు. బుధవారం మంత్రి పదో తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ సెక్రటరీ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలను అధికారులు విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ప్రతీ పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద తప్పనిసరిగా ఏఎన్‌ఎం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు రవాణా కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఉదయం, మధ్యాహ్నం నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను bse.telangana. gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 9,078 మంది పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో బాలురు 4,445 మంది, బాలికలు 4,633 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. డీఈవో రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



ఆదివాసీ మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

కడెం: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ దత్తత గ్రామమైన మండలంలోని కడెం –పెద్దూర్ జీపీ పరిధిలోని కొలాంగూడను సందర్శించారు. ప్రధాన రహదారి నుంచి కాలినడకన గ్రామానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఆదివాసీలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ ఇంటి ఆవరణలో కూరగాయలు పండించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలోని మహిళలు ఉపాధి పొందేందుకు పల్లిపట్టి పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఆవరణలో అదనపు గదులు నిర్మించి, అందులో పల్లిపట్టీ తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ కింద అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ.50వేల ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో తాగు, సాగునీటి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. గ్రామంలో చేతిపంపులు ఏర్పాటు చేయడానికి గ్రౌండ్‌వాటర్‌ను పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సాగునీటి కోసం ఫాంపాండ్స్ ఏర్పాటు చేయించాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. స్త్రీనిధి నుంచి గొర్రెల పెంపకానికి రూ.73 వేల రుణం ఇస్తున్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల కేంద్రంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్యను ఆదేశించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, సీసీ గంగాప్రసాద్, ఎంపీపీ అలెగ్జాండర్, ఎంపీవో వెంకటేశ్, ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం, ఈజీఎస్, ఐకేపీ, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఆధార్ నవీకరణ పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఆధార్ నవీకరణ వందశాతం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో ఆధార్ అప్‌డేట్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 2010–2016 మధ్య ఆధార్‌కార్డు పొందినవారు ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ సేవలను సులభంగా పొందేందుకు పేరు, చిరునామాకు సంబంధించిన రుజువు పత్రాలతో దగ్గరలోని ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 10 శాతం నవీకరణ జరిగిందని, ఆగస్టు 31వరకు మిగతా 90 శాతం నవీకరణ జరగాలని, ఇందుకు సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.


సీపీఆర్‌తో 50శాతం మరణాలు తగ్గించవచ్చు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: సీపీఆర్‌తో 50శాతం గుండెపోటు మరణాలు తగ్గించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సీపీఆర్‌పై జిల్లాలోని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, స్టాఫ్‌నర్స్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో జిల్లా డిప్యూటీ డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సమత, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, సీపీఆర్ జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల నుంచి సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థినులు

నిర్మల్‌రూరల్: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ద్వితీయ సంవత్సర పరీక్ష నిర్వహించారు. 6,059 మంది విద్యార్థులకు 5,792మంది హాజరు కాగా, 267 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరిలో 5,345 మందికి 5,119 మంది హాజరు కాగా 226 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరిలో 714 మందికి 673 మంది హా జరు కాగా, 41 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకుల పాఠశాల, డీఐవో పలు ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేశారు.

చేపల మార్కెట్‌లో వసతులు కల్పించాలి

నిర్మల్ చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్‌లో అన్ని రకాల వసతులు కల్పించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న చేపల మార్కెట్‌ను కలెక్టర్ పరిశీలించారు. పనులు పూర్తయినందున మొక్కలు నాటాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులున్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న మహమూద్

సారంగపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమూద్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తాండ్ర (జీ) గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.100 నుంచి రూ.120 మాత్రమే చెల్లిస్తోందని తెలిపారు. అవి కూడా ప్రతీవారాంతంలో వారి ఖాతాల్లో జమస్తున్నారు. నెలల తరబడి చెల్లింపులు చేయడం లేదని వాపోయారు. దీంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలోలాగా కూలీలకు ప్రభుత్వం పనిముట్లు పంపిణీ చేయకపోవడంతో అదనంగా కూలీలే కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కూలీల సౌకర్యార్థం టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వెంటనే ప్రభుత్వం కూలీల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు శాంతికుమారి, రేణుక తదితరులున్నారు.

కబ్జా భూమిని పరిశీలించిన ఆర్డీవో



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవికుమార్

లోకేశ్వరం: అబ్దుల్లాపూర్‌లో కబ్జాకు గురైన భూమి కోర్టు అధీనంలో ఉందని, కోర్టు తీర్పు వచ్చేదాకా ఇరు గ్రామాలవారు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని భైంసా ఆర్డీవో రవికుమార్ సూచించారు. బుధవారం అబ్దుల్లాపూర్ గ్రామ సరిహద్దు ప్రాంతంలోని 328 సర్వే నంబర్‌లోగల భూమిని కోర్టు ఆదేశాల మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్కపూర్ గ్రామానికి చెందిన కొబ్బన్నోల్ల గంగన్నతోపాటు అబ్దుల్లాపూర్ వీడీసీ సభ్యులతో మాట్లాడి భూమి గురించి తెలుసుకున్నారు. ఈ భూమి కోర్టు అధీనంలో ఉందని, పూర్తి సర్వే చేయించి నివేదిక కోర్టుకు అందజేస్తామని తెలిపారు. ఆర్డీవో అబ్దుల్లాపూర్–కన్కపూర్ గ్రామస్తులతో మాట్లాడుతుండగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్ జోక్యం చేసుకుని భూకబ్జాపై ప్రశ్నించారు. దీంతో అబ్దుల్లాపూర్ గ్రామస్తులు మురళీమోహన్‌తో వాగ్వాదానికి దిగగా ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆర్డీవో వెంట డీటీ అశోక్, అబ్దుల్లాపూర్, కన్కపూర్ గ్రామస్తులున్నారు.

నేడు భైంసాలో శోభాయాత్ర



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

భైంసాటౌన్: శ్రీరామనవమిని పురస్కరించుకుని పట్టణంలో గురువారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. హైకోర్టు కూడా ర్యాలీకి అనుమతిచ్చింది. దీంతో స్థానిక పురాణాబజార్‌లోని గోశాల నుంచి పిప్రికాలనీలోని రాంలీలా మైదానం వరకు రాముని విగ్రహంతో శోభాయాత్ర చేపట్టనున్నారు. శోభాయాత్ర నిర్వహించే దారి పొడవునా కాషాయజెండాలు ఏర్పాటు చేశారు. గోశాల నుంచి గుజిరిగల్లి, భట్టిగల్లి, కుభీర్‌రోడ్డు, పద్మావతి కాలనీ, మున్సిపల్ చౌరస్తా, బస్టాండ్ మీదుగా శివాజీచౌక్, రాంలీలా మైదానం వరకు దారి పొడవునా, కూడళ్ల వద్ద కాషాయ జెండాలు రెపరెపలాడుతున్నాయి. కాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఎస్పీ ప్రవీణ్‌కుమార్ భైంసాకు చేరుకుని శోభాయాత్ర రూట్‌మ్యాప్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్‌లోని టింబర్‌యార్డు, ఏరియా స్టోర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కార్పొరేట్ చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టోర్స్ మెటీరియల్ ఇస్యూవర్ రెండు పోస్టులు ఏళ్ల తరబడిగా భర్తీ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, నాయకులు కాశీరావు, అద్దు శ్రీనివాస్, జీ.సదానందం, నీరటి లక్ష్మణ్, రమణారావు, విష్ణుప్రసాద్, నిరంజన్‌రెడ్డి, కుమారస్వామి, ఎడ్ల వెంకటయ్య, లంక రామస్వామి పాల్గొన్నారు.

'డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలివ్వాలి'



మాట్లాడుతున్న రామిల్ల రాధిక


మందమర్రిరూరల్(చెన్నూర్): డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలివ్వాలని సంఘం అధ్యక్షురాలు రామిల్ల రాధిక డిమాండ్ చేశారు. బుధవారం వివిధ పార్టీల నాయకులతో కలిసి దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిస్మిస్ కార్మికులు 19 సంవత్సరాలుగా దీక్ష చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ప్రతిరోజు దీక్షా శిబిరం ముందునుంచే కార్యకలాపాలకోసం వెళ్లే నాయకులు, అధికారులకు కార్మికుల గోడు కనిపించడంలేదన్నారు. సింగరేణి గుర్తింపు, సాధారణ ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన తర్వాత ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉద్యోగాలు ఇచ్చేలా కృషి చేయాలని, లేనిపక్షంలో కలిసి వచ్చే సంఘాలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు నర్సింగ్, దీక్షితులు, సంఘం నాయకులు రవీందర్, తదితరులు ఉన్నారు.

పోలీసుల కవాతు



జిల్లా కేంద్రంలో పోలీసుల కవాతు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం రాత్రి నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ కవాతు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఇందులో సుమారు 300మంది పోలీసులు, ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఇద్దరు డీఎస్పీలు, పది మంది సీఐలు, 25 మంది ఎస్సైలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ నిర్మల్ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.



ముథోల్: మండల కేంద్రంలో పోలీసుల కవాతు నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించకుని సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో బలగాలతో ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించుకోవాలని తెలిపారు. ఎస్సైలు తిరుపతి, విక్రమ్, సాయికుమార్, మహేశ్, ఏఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులున్నారు.

ఫలం.. పోషకాలు పుష్కలం

- రోజా విరమణలో వినియోగం
- రంజాన్ మాసంలో ప్రత్యేకం



పోషకాలను ఇచ్చే పండ్లు

నెన్నెల(బెల్లంపల్లి): రంజాన్ మాసం వచ్చిందంటే పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు ఎక్కువగా పండ్లనే ఇష్టపడుతారు. ఎందుకంటే వాటిలో పోషకాలు అధికంగా ఉండడమే కారణం. సుమారు 15 గంటల పాటు ఉపవాసం ఉండి సాయంత్రం దీక్ష విరమణ సమయంలో పోషకాలు అధికంగా ఉండే ఫలాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు. తాజా పండ్లతో పాటు డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

పోషకాల ఖర్జూర..

ఖర్జూరలో తక్షణ శక్తినిచ్చే పోషకాలు ఉంటాయి. మహ్మద్ ప్రవక్త రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సమయంలో వీటినే ఎక్కువగా తీసుకునే వారు. చాలామంది సున్నత్(మహ్మద్ ప్రవక్త ఆచారం)లో భాగంగా ముందుగా ఖర్జూర పండ్లతోనే ఉపవాసదీక్షలు విరమిస్తారు. ఆ తర్వాతే ఇతర ఫలాలు తింటారు. ఈ క్రమంలో వాటి గిరాకీని తట్టుకునేందుకు రంజాన్ మాసంలో వ్యాపారులు విదేశాల నుంచి కూడా మేలు రకమైన ఖర్జూరను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇందులో విటమిన్లు బీ–1, బీ–2, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి.

శక్తినిచ్చే ఎండుఫలం

ఎండుఫలాలు మంచి శక్తినిస్తాయి. సౌదీలో ఎండు ఫలాలు అధికంగా లభిస్తాయి. మహ్మద్ ప్రవక్త దీక్ష విరమణ కోసం ఎండుఫలాలైన ఖర్జూర, కాజు, బాదం, పిస్తా, అక్రోట్‌లను అధికంగా తినేవారని చరిత్ర చెబుతోంది. ఈ ఎండు ఫలాల్లో అధిక పోషకాలు ఉంటాయి. దీంతో ముస్లింలు రోజా విరమణ కోసం ఇఫ్తార్‌లో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. తర్బూజ, కర్బూజ, బత్తాయి, ద్రాక్ష, సంత్రాలలో దాహం తీర్చే గుణాలు ఉంటాయి. విటమిన్లు, పీచు పదార్థాలు ఉంటాయి. అరటిలో విటమిన్–ఏ, కాల్షియం ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

రోజా విరమణకు ఖర్జూర శ్రేష్టం



మహ్మద్ ప్రవక్త ఖర్జూర పండుతోనే రోజా విరమణ చేసే వారని ఖురాన్‌లో పేర్కొన్నారు. వీటిలో బీ–1, బీ–2, కాల్షియం, పోషక విలువలు మెండుగా ఉంటాయి. అందుకే వివిధ దేశాల్లో రోజు విరమణకు ముందుగా ఖర్జూరనే ఉపయోగిస్తారు.

– మహ్మద్ ఇబ్రహీం ఖాద్రి

డీహైడ్రేషన్ దూరం



రోజుకు సుమారు 15 గంటల పాటు అన్నపానియాలు ముట్టుకోకుండా కఠిన ఉపవాస దీక్ష ఉంటుంది. రోజా విరమణ సమయంలో పండ్లు తీసుకుంటే శక్తితో పాటు శరీరానికి కావాల్సిన నీటిశాతం అందుతుంది. ఇఫ్తార్‌లో పండ్లు తీసుకుంటే ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఉపవాస దీక్ష విరమణకు పండ్లు తీసుకుంటారు.

– యూనిస్ రజాఖాద్రి హఫీజ్, బెల్లంపల్లి

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి
- ఘనంగా జామ్డా ఆశ్రమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

నార్నూర్: పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యసాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి అన్నారు. మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతిప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ఎవరెస్ట్ శిఖరం అధిరోహిత మాలోత్ పూర్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల్లో విద్య నైపుణ్యం పెంచడానికి కార్యక్రమాలు చేపడుతూ వంద శాతం ఫలితాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. తల్లిదండ్రులు చిన్నచిన్న పండుగలకు విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లి వారి విద్యకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చదువు ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యతను వెలికితీసి పోటీ ప్రపంచం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఎవరెస్టు శిఖరం అధిరోహిత మాలోత్ పూర్ణ మాట్లాడుతూ ఆడపిల్లలు భయపడకుండా ముందుకెళితే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. ఒక లక్ష్యం పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని సూచించారు. జీవితంలో ఆరోగ్యం, బాధ్యత, లక్ష్యం ఈ మూడు ఉంటే ఉన్నత శిఖరానికి చేరుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వక ఈడీ దాడులు సరికాదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఉద్దేశపూర్వకంగా ఈడీ దాడులతో పాటు వారిని వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేయడం బీజేపీ ప్రభుత్వ హేయమైన రాజకీయాలకు నిదర్శనమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. ప్రశ్నించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు రాజ్యాంగబద్ధమైనప్పటికీ బీజేపీ ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. రాచరిక పాలన కొనసాగిస్తుందని వివరించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి బీజేపీ హటావ్ భారత్‌కో బచావ్ నినాదంతో సీపీఐ పోరాటాలకు సిద్ధమవుతోందని వివరించారు. ఏప్రిల్ 14న మొదలైన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం మే 14 వరకు కొనసాగనుందని, ఇందులో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలను కలుపుకుని ప్రజా సమస్యలపై పోరాడటం చేస్తామని తెలిపారు. ఇందులో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్‌కుమార్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

'ఔషధాల ధరల పెంపు ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రైట్ టూ హెల్త్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోతె రాజలింగు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సల్లో రోగులకు ఉపశమనం కలిగించే ఔషధాల ధరలను ఏప్రిల్ మాసం నుంచి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వలన లక్షలాది మంది పేదలపై భారం పడుతోందన్నారు. మందుల ధరల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిత్వ శాఖకు వినతిపత్రం పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశం, చిరంజీవి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది.



షేక్ రహీం మృతదేహం

ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... నగర్ గ్రామానికి చెందిన షేక్ రహీం (33) భార్య మౌలానితో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి రహీం తాగుడుకు బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. తమ్ముడు షేక్ జాఫర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా..

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర రహదారిపై బుధవారం వేకువజామున లారీ అదుపుతప్పి బోల్తాపడింది. భైంసాలోని కాటన్ జిన్నింగ్ మిల్లు నుంచి పత్తి బేళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ స్థానిక హరియాలీ ఫంక్షన్‌హాల్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీలో పత్తిబేళ్లు కింద పడిపోయాయి. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. 161 బీబీ రహదారి పనుల్లో జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పనులు జరుగుతున్న చోట హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువ నీటిలో గల్లంతై యువకుడు మృతి

దండేపల్లి(మంచిర్యాల): ప్రమాదవశాత్తు కాలువ నీటిలో గల్లంతై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్యంపేటకు చెందిన ఒర్సు మల్లేశ్ (22) బుధవారం సాయంత్రం మిత్రులతో కలిసి కాలువలో స్నానం చేసేందుకు వెళ్లాడు. లిఫ్టు డెలివరీ పాయింట్ సమీపంలోనే కాలువలోకి దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటిప్రవాహం ఎక్కువ రావడంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన మిత్రులు నీటిలో గాలించినా దొరకకపోవడంతో పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సాంబమూర్తి ఈతగాళ్ల సాయంతో కాల్వలో వెతికించగా మృతదేహం లభించింది. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'లీకేజీ'కి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

పాతమంచిర్యాల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.బాబన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లీకేజీల వెనుక కేవలం ఇద్దరు ఉద్యోగుల హస్తం ఉందని మంత్రి కేటీఆర్ వాస్తవాలను పక్కదోవ పట్టించడమే అన్నారు. పాలకుల అసమర్థత వల్లే ప్రశ్నాపత్రాలు లీకేజీ అవుతున్నాయని, అది పెద్దల అండదండలతో ఒక వ్యాపారంగా ఎదిగిందన్నారు. ఫలితంగా విద్యార్థులు భవిష్యత్‌పై నమ్మకం కోల్పోయారన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనేల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రదీప్, విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ సిరాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అగ్రిమెంట్ల ఉత్తర్వులు విడుదల చేయాలి

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): లేబర్ కమిషనర్ ఎదుట కార్మిక సంఘాలు, కంపెనీకి మధ్య జరిగిన అగ్రిమెంట్ల ఉత్తర్వులను యాజమాన్యం విడుదల చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే5 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియాలో జరిగిన అగ్రిమెంట్లు అమలుకావడం లేదన్నారు. 2011లో అలవెన్సులపై ఐటీ మాఫీ చేసే ఒప్పందం అనంతరం క్యాడర్ స్కీం ఒప్పందాలను అమలు చేయలేదన్నారు. ఒప్పందాలు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించి ఏం లాభమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టనున్న 'చలో ఢిల్లీ' యాత్రను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, సెక్రటరీ భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖర్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ముల్కల్ల ఇటుకబట్టీలో చిన్నారి మృతి



రెడ్డి దీపిక (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులోని ఓ ఇటుకబట్టీలో రెడ్డి దీపిక(3) అనే చిన్నారి అస్వస్థతతో మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కోటపల్లి మండలం నక్కలపల్లికి చెందిన రెడ్డి శారద, రాములు దంపతులు ముల్కల్ల ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. దంపతుల కుమార్తె దీపిక మంగళవారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. వాంతులు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇటుక బట్టి యజమాని గుట్టుచప్పుడుగా చిన్నారి మృతదేహాన్ని సొంతూరికి తరలించి అక్కడే అంత్యక్రియలు జరిపించారు. కాగా ఇటుకబట్టీల యజమానులు కూలీల ఆరోగ్యంపై పట్టించుకోకుండా వారి ప్రాణాలతో చెలగాలమాడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు సీజ్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మంచిర్యాలక్రైం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున మైనింగ్ సిబ్బందితో కలిసి గోదావరి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తాండూర్(బెల్లంపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. తాండూర్ మండలం అచ్చులపూర్ శివారులోని వాగులో నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

డీడీలు చెల్లించి ఇళ్ల పట్టాలు పొందాలి



డీడీలు చెల్లించాలని సూచిస్తున్న మధుసూదన్‌నాయక్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డీడీలు చెల్లించని పలువురి ఇళ్లకు బుధవారం అదనపు కలెక్టర్‌తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనుందని, వెంటనే డీడీలు చెల్లిస్తే ఇంటిపై సర్వహక్కులు పొందవచ్చన్నారు. ఆయన వెంట ఆర్డీవో వేణు, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

ఖానాపూర్: శ్రీరామనవమి పురస్కరించుకుని పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలోగల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం పలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పండితుడు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో ఘనపతిపూజ, కర్మణ పుణ్యాహవాచనం, శ్రీసీతారామస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, పంచామృత త్రయోదశ కళశ మహాభిషేకం, ముత్తయిదువులతో సామూహిక కుంకుమార్చన, సుదర్శన లక్ష్మీ నారాయణ, రామచంద్ర మూలమంత్ర హోమం తదితర పూజలు జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్‌శర్మ, శశిధర్‌శర్మ, ఆలయకమిటీ సభ్యులు సతీశ్‌రావు దేశ్‌పాండే, అల్లాడి వెంకటేశ్వర్లు, పాదం రాకేశ్, ఆయిందాల జనార్దన్, లాండేరి కిషన్, జన్నారపు శంకర్, చంద్రహాస్, సట్ల నారాయణ, రాముచారి తదితరులున్నారు.

గడువు తీరిన పాల ప్యాకెట్ల అమ్మకాలు!

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కొర్విచెల్మలో ఓ కిరాణ దుకాణంలో గడువు తీరిన పాల ప్యాకెట్ల (సోయ పాలు) విక్రయం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాస్వాములు బుధవారం కిరాణ దుకాణంలో పూజాసామగ్రితో పాటు, పాలు కొనుగోలు చేశారు. దీంతో దుకాణం యజమాని వారికి గడువు తీరిన పాల ప్యాకెట్లు ఇవ్వడంతో వాటిని గమనించిన స్వాములు నివ్వెరపోయారు. పాల ప్యాకెట్ల గడువు గత నెల 27 వరకే ఉంది. గడువు ముగిసి నెల రోజులు దాటినా వాటినే ప్రజలకు విక్రయించడంపై మండి పడ్డారు. విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు.

నెన్నెలలో పురాతన రాతి విగ్రహం లభ్యం

నెన్నెల(బెల్లంపల్లి): మండలం కేంద్రంలోని పెద్ద చెరువులో పురాతన వినాయక రాతి విగ్రహం ఉన్నట్లు హనుమాన్ దీక్షాపరులు గుర్తించారు. విగ్రహాన్ని బయటకు తీసి ఒక చెట్టు కింద ఉంచి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఇది సుమారు 800ల సంవత్సరాల క్రితం నాటిదని, చాళుక్యుల దేవాలయం గర్భగుడి ద్వారానికి పైభాగానికి సంబంధించిన రాతి విగ్రహమని గన్‌పూర్‌కు చెందిన చారిత్రక, పురావాస్తు పరిశోధకుడు పంజాల సాయిరాం తెలిపారు.

ఎడ్లు చోరీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌కు చెందిన రైతులు వైరాగడే ఆనంద్‌రావు, వైరాగడే శ్రవణ్, మెంగ్రె బాబురావుకు చెందిన ఎడ్లు ఉదయం మేత కోసం బయటకు వెళ్లాయి. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో రైతులు శివారు ప్రాంతంలో వెతికేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గుండి రహదారి సమీపంలోని ఒర్రె వద్ద మూడు ఎడ్లు చెట్టుకు కట్టేసి ఉండడంతో వాటిని వదిలేసి ఇంటికి తరలించారు. గతంలో సైతం జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఆవులు సైతం అదృశ్యమయ్యాయి. కొంత మంది వ్యక్తులు పశువులను అక్రమంగా బంధించి, కబేళాలకు తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

పాతమంచిర్యాల: పౌరహక్కులు, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీసీపీ సుధీర్ రాంనాద్‌కేకన్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, నరేందర్, ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, జిల్లా షెడ్యూలు కులాల ఉపసంచాలకులు రవీందర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సివిల్ రైట్స్ డే సభలకు పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ, ఆరోగ్య, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలన్నారు. డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను 60 రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రెండు మూడు రోజుల్లో ఆదిలాబద్ నుంచి అట్రాసిటీ కోర్టు మంచిర్యాలకు రానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

వేసవికాలం సమీపిస్తున్నందువల్ల మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో మిషన్ భగీరథ ముఖ్య అభియంత బీసీ జ్ఞాన్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైప్‌లైన్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ ఈఈ మధుసూదన్, పీఆర్ ఈఈ ప్రకాష్, ఆర్అండ్ బీ ఈఈ రాము, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి

నిర్మల్ టౌన్: యువత దేశప్రగతిలో భాగస్వాములు కావాలని సేంద్రియ వ్యవసాయ నిపుణుడు నల్ల చంద్రమోహన్, ఆయుర్వేద డాక్టర్ అల్లాడి ప్రవీణ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ జీ 20 మిషన్ లైఫ్ సిరిధాన్యాల గురించి విద్యార్థులకు వివరించారు. యువత దేశ ప్రగతిని అన్ని రంగాల్లో ముందుండి నడిపించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుశీల్‌బాడ్, వలంటీర్లు రవళి, కిరణ్, ఎస్.ప్రవీణ్, మనోజ్‌యాదవ్, చిన్నోళ్ల ప్రవీణ్, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ పరిశీలన

చెన్నూర్: పట్టణం సమీపంలోని గోదావరినదిలో ఉన్న ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రావు సందర్శించారు. సర్వేయర్ తిరుపతిని అడిగి హద్దులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైన అక్రమాలు చోటు చేసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజీమొద్దీన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.